క్లుప్తంగా

వైభవంగా ముత్యాలమ్మ జాతర



మాచర్ల రూరల్: మండలంలోని జమ్మలమడక గ్రామంలో ముత్యాలమ్మ జాతర సందర్భంగా శుక్రవారం కుంకుమ బండ్లతో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు గ్రామ వీధుల్లో భక్తుల కోలాటం, డప్పు వాయిద్యాల మధ్య సాగింది. భక్తులు వీధుల్లో సందడి చేశారు. స్వామికి మొక్కులు తీర్చుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తిప్పారెడ్డి గోపాల రెడ్డి, గొబ్బూరి ఆదెయ్య, ముక్కా గురవయ్య, మున్నా నరసింహారావు, కొండా పెద అక్కులు, చిన్నారి చిన్న అబ్బాయ్, కూరాకుల శ్రీను, పచ్చిపాల చౌడయ్య, కూరాకుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. రూరల్ సీఐ షేక్ నఫీజ్ బాషా, ఎం.నారాయణ సిబ్బంది ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

భక్తులకు అన్నదానం



విజయపురిసౌత్: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని విజయపురిసౌత్‌లోని మెయిన్ బజార్, సీ టైపులోని కనకదుర్గ ఆలయాల వద్ద శుక్రవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో అమ్మవారు మహిషాసుర మర్దిని దేవిగా దర్శనమిచ్చారు. విజయపురి సౌత్‌లోని సత్యసాయి ప్రేమ మందిరంలో సీనియర్ జర్నలిస్ట్ ఎం.ఎస్.నాగేశ్వరరావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అరుణాదేవి, శ్రీతేజ సాయి, కార్తీక్, ఎం.సుబ్బలక్ష్మి, వెంకటరమణ, దేవస్థాన అధ్యక్షులు హరి, దేవాలయ అర్చకులు హనుమాన్ చారి, సీతారామ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

దుర్గా హోమం, అన్నదానం



మాచర్ల రూరల్: విజయదశమి దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని 14వ వార్డు, పత్తిఫ్యాక్టరీ వీధిలో శుక్రవారం అమ్మవారి విగ్రహం వద్ద గణపతి, దుర్గా హోమాన్ని ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ అర్చకులు కొండవీటి రాజగోపాలాచార్యులు నేతృత్వంలో కొండవీటి దుర్గా కుమార్ చార్యులు అమ్మవారికి గణపతి, దుర్గా హోమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యూటన్స్ గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, పద్మావతి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హోమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొమెర పుల్లంరాజు, పల్లా శ్రీనివాసరావు, దేవళ్ళ ప్రసాద్, అమర్‌నాథ్, సాయి పాల్గొన్నారు. సుమారు 2వేల మందికిపైగా భక్తులకు అన్నదానం చేశారు.

వివాహిత ఆత్మహత్య

నరసరావుపేటటౌన్: వివాహిత మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం పట్టణంలో జరిగింది. ఆమె మృతికి భర్త కుటుంబ సభ్యుల వేధింపులే కారణమంటూ మృతురాలి బంధువులు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన కొమ్ము సౌజన్య (25)కు నరసరావుపేటకు చెందిన ఆర్లగడ్డ ఏసుబాబుతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి స్థానిక కంభంపాలెంలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సౌజన్య మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్ ఒగ్గెకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ విజయ్ చరణ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు వైద్యశాల వద్దకు చేరుకున్నారు. తన కుమార్తె మృతికి అత్త, మరిది వేధింపులే కారణమంటూ తండ్రి కొమ్ము నాగరాజు ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బతుకు బెధరహో!

- భగ్గుమంటున్న ధరలు
- సామాన్యులు విలవిల
- ఉప్పుపప్పు నుంచి కూరగాయల వరకూ పైపైకి





కందిపప్పు



వంట నూనెలు

గురజాల : భగ్గుమంటున్న ధరలతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్నాయి. మూడు, నాలుగు నెలల వ్యవధిలోనే ఒకొక్క సరుకు ధర 20 నుంచి 40 శాతం వరకు పెరిగాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కందిపప్పు ధర కిలో రూ.200 వరకు ఎగబాకింది. పేదలు, సామాన్యులు మధ్యతరగతి ప్రజలు కందిపప్పును కొనాలంటేనే భయపడుతున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ హయాంలో రేషన్ వాహనాల ద్వారా కందిపప్పు పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ దుకాణాల్లో కందిపప్పు సరఫరాను నిలుపుదల చేశారు. బియ్యం, చింతపండు, పప్పు దినుసులు ధరలూ భగ్గుమంటున్నాయి. పేదలు పండగ నాడు పచ్చడి మెతుకులకూ నోచుకునే పరిస్థితి కనిపించడం లేదు.



దుకాణంలో కూరగాయలు

వస్తువు పేరు (కిలో/లీటర్)	నెల క్రితం ధర	ప్రస్తుతం ధర
పామాయిల్ లీటర్	రూ .94	రూ.130
సోనామసూరి బియ్యం	రూ.60	రూ.70
సన్‌ఫ్లవర్ ఆయిల్	రూ .115	రూ.140
మైదా పిండి	రూ.40	రూ.45
చింత పండు	రూ.120	రూ.160
వెల్లుల్లి	రూ.200	రూ.400
శనగ గుళ్లు	రూ.150	రూ.180
కంది పప్పు	రూ.160	రూ.200
ఎండు కొబ్బరి	రూ.140	రూ.180
ఉప్మా రవ్వ	రూ.40	రూ.45

- ఉల్లిపాయల ధర కిలో రూ.70 వరకు పలుకుతోంది. కోయకుండానే కన్నీళ్లు తెప్పిస్తోంది. రెండునెలల క్రితంతో పోల్చుకుంటే ఉల్లి ధర రెండింతలు పెరిగిందని వినియోగదారులు చెబుతున్నారు.
- మసాలా దినుసుల ధరలూ ఘాటు పుట్టిస్తున్నాయి. వెల్లుల్లి పావుకిలో రూ.100 పలుకుతున్నాయి.
- నూనెల ధర సలసలా కాగుతోంది. పామాయిల్ మొదలుకుని సన్‌ఫ్లవర్, శనగ నూనె ప్యాకెట్ల ధరలు రూ.30 నుంచి 50 రూపాయల వరకు అదనంగా పెరిగాయి.
- కూరగాయాల ధరలూ 3 నుంచి 4 రేట్లు పెరిగిపోయాయి. కిలో టమాట ధరలు రూ.80 నుంచి రూ.100 వరకు, పచ్చిమిర్చి కిలో రూ.80కి పైనే పలుకుతున్నాయి.. చిక్కుళ్లు కిలో రూ.120 చొప్పున అమ్ముతున్నారు. ఆకుకూరల ధరలూ ఆకాశన్నంటాయి. అదేమని ప్రశ్నిస్తే వరదలకు కూరగాయ, ఆకుకూరల తోటలు పాడైపోయాయని చెబుతున్నారు. ఫలితంగా సామాన్యులు విలవిల్లాడుతున్నారు.

ధరలను నియంత్రించాలి



కూటమి ప్రభుత్వం వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. వీటిని నియంత్రించే దిశగా సర్కారు చర్యలు చేపట్టాలి. ఏ వస్తువు కొనాలన్నా భయమేస్తోంది. ప్రభుత్వం తక్షణం ధరల పెరుగుదలను అరికట్టాలి. లేకుంటే సామాన్యుడు బతకడం కష్టం.


– సుంకర ఇస్మాయేలు, ఇనుపరాజుపల్లి

కూరగాయల ధరలు తగ్గించాలి



వంద రూపాయలు పెట్టి కూరగాయలు కొనుగోలు చేసినా సంచి నిండటం లేదు. గతంలో వంద రూపాయల కూరగాయలు తీసుకుంటే సంచి నిండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ధరలు పెరిగిపోవడమే కానీ తగ్గిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని ధరలు తగ్గించే విధంగా ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉంది.

– షేక్ జానీబేగం, గృహిణి, మాచవరం



సత్రశాలలో మహిషాసురమర్దినిగా భ్రమరాంబికాదేవి



రెంటచింతలలో మహిషాసుర మర్దినిగా వాసవీమాత



పిడుగురాళ్లలో రూ.20 లక్షల నగదుతో అమ్మవారికి అలంకారం



పిడుగురాళ్ల నాగుల గుడిలో ప్రత్యేక అలంకారం



పాత మాచర్లలో మహిషాసుర మర్దినిగా వాసవీమాత



మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



మహిషాసురమర్దినిగా పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లి



మాచవరంలో మహిషాసుర మర్దినిగా అమ్మవారు



చెన్నాయపాలెంలో అమ్మవారికి ప్రత్యేక అలంకారం



రెంటచింతలలోని రామాలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



దాచేపల్లి మండలం నారాయణపురంలో పూజలు చేస్తున్న వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి దంపతులు



పిడుగురాళ్ల కనక దుర్గమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జయహో దుర్గాభవానీ

దసరా నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. శుక్రవారం తొమ్మిదోరోజు అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మ దివ్య మంగళ స్వరూపాన్ని భక్తులు కనులారా తిలకించి పులకించారు. పలు చోట్ల ప్రత్యేక హోమాలు, అన్నదానాలు నిర్వహించారు. - రెంటచింతల/దాచేపల్లి/పిడుగురాళ్ల/మాచర్ల రూరల్/కారెంపూడి/మాచవరం

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండండి

బొల్లాపల్లి: మండలంలోని చక్రాయపాలెంలో శుక్రవారం కారెంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రమ్య, వైద్య సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. వారం రోజులుగా చక్రాయపాలెంతో పాటు పరిసరాల గ్రామాలైన హనుమాపురం, రాజానాయక్ తండా, బీఎల్ కాలనీలో వాంతులు, విరేచనాలతో ప్రజలు అస్వస్థతకు గురికావడంతో దగ్గరలోని కారెంపూడిలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పల్నాడు జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో ఆదేశాల మేరకు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

వాహనాల నడకయాతన



అధ్వానంగా కారెంపూడి రోడ్డు



గుంతల మయంగా రహదారి

గురజాల – కారెంపూడి రహదారిలో ప్రయాణించాలంటే నరకయాతన పడాల్సిందే. చర్లగుడిపాడు దాటిన తరువాత ఈ రహదారి అంతా గుంతలమయంగా మారింది. దీంతో రోడ్డులో వాహనాలు నడపాలంటే ఇబ్బందులు పడాల్సిందే. గత నెలలో కురిసిన వర్షాలకు రహదారులు గుంతలమయంగా మారాయి. పెద్ద పెద్ద గుంతలు పడి వాహనదారులు రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. ఆదమరిచి వాహనం నడిపితే ఈ రహదారిలో అంతే సంగతులు. పెద్ద గుంతలు దర్శనమిస్తున్నా ఆయా శాఖల అధికారులు నిమ్మకునీరెత్తినట్లు ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు. - గురజాల రూరల్

బాలికా విద్యను ప్రోత్సహించాలి



దాచేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు



జానపాడులో బాలబాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ రుక్సానా బేగం

దాచేపల్లి : బాలికలను తప్పనిసరిగా చదివించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ రత్నకుమారి చెప్పారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. దాచేపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ రత్నకుమారి మాట్లాడుతూ.. ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండేంత వరకు పెళ్లి చేయకుండా చదివించాలని, ఒక మహిళ చదువుకుంటే ఆ కుటుంబమంతా వెలుగులో ఉంటుందని చెప్పారు. బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం కల్పించిన అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతమైన చదువులు బాలికలు చదవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

పిడుగురాళ్ల రూరల్: బాలికలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సీడీపీఓ రుక్సానా బేగం అన్నారు. మండలంలో జానపాడు గ్రామంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ సెంటర్‌లో బాలికలకు, మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాలికా విద్యను ప్రోత్సహించాలని సూచించారు. లింగ వివక్షను విడనాడాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

సస్య రక్షణతోనే చీడపీడల నివారణ

రెంటచింతల: పత్తిపంటకు ఆశించే పచ్చ, తెల్లదోమ వంటి క్రిమికీటకాలు, రెక్కల పురుగుల నిర్మూలనకు రైతులు వ్యవసాయాధికారుల సూచనలతోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి పంటకు ఆశించే చీడపీడల నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంటలో గులాబీ రంగు పురుగు ఉధృతంగా ఉన్నప్పుడు ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలను అమర్చుకుని రెక్కల పురుగుల ఉధృతిని నివారించవచ్చునన్నారు. ఒక్కొక్క బుట్టకు 8 రెక్కల పురుగుల చొప్పున రెండు, మూడు రోజులు వరుసగా పడినా, 10 పత్తి పువ్వులకు ఒక గుడ్డిపువ్వు, 10 కాయలకు ఒక పుచ్చుకాయ గమనించిన వెంటనే దిమోడికాడ్ 1.5 గ్రాములు లేదా క్లోరిఫైరిపాస్ 2.5 మిల్లి లీటర్లను ఒకలీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. పత్తిలో తెల్లదోమ ఎక్కువగా ఉంటే ఎకరాకు 20 పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎకరాకు 5 శాతం వేపగింజల కషాయం లేదా 250 మి.మీ.ల వేపనూనె గాని డ్రైయజోఫాస్ (ఓస్టాతియన్)ను 2.5 మి.లీటర్లను గాని ఏసిఫేట్ 1.5 గ్రాములను లీటర్ నీటికి కలుపుకుని పిచికారీ చేసుకున్నట్లు అయితే తెల్లదోమ ఉధృతిని నివారించవచ్చునన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు



ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున

రెంటచింతల: మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధగా వాహనాలను నడుపుతున్న మైనర్లను, వాహనాలకు సరైన పత్రాలు, లైసెన్స్ లేని వారిని పోలీసు స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇస్తామని పేర్కొన్నారు. యువకులు వాహనాలను అతివేగంగా నడిపి ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. వేగం కన్నా ప్రాణం మిన్నా అనే విషయాన్ని గుర్తించుకోవాలని చెప్పారు. ద్విచక్రవాహనాన్ని నడిపేవారు హెల్మెట్‌ను, ఫోర్‌వీల్స్ నడిపేవారు సీట్ బెల్ట్‌ను తప్పనిరిగా ధరించాలని, వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పని సరిగా ఉండాలన్నారు. అర్హతలేని వారు తమ వాహనాలపై ప్రెస్, డాక్టర్, ఆర్మీ అని స్టిక్కర్ వేయించుకోవడం చట్టరీత్యానేరమని అటువంటివారిపై కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

10న రెడ్‌క్రాస్ బ్లడ్‌సెంటర్ ప్రారంభం

నరసరావుపేట: ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటుచేసిన రెడ్‌క్రాస్ బ్లడ్‌సెంటర్‌ను నవంబరు పదో తేదీన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభిస్తారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్ రెడ్డి ఆహ్వానం మేరకు శుక్రవారం ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన బ్లడ్‌సెంటర్‌ను సందర్శించి మాట్లాడారు. జిల్లా వైద్యశాల 200 పడకల సామర్థ్యం కలిగి ఉందని, పేద ప్రజలకు, రోగులందరికీ సేవలు అందిస్తుందని అన్నారు. బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి విజయ్ కుమార్, రెడ్‌క్రాస్ జిల్లా వైస్‌చైర్మన్ శరత్‌బాబు, కోశాధికారి మురళీకృష్ణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు బత్తులమురళి, డాక్టర్ రెహమతుల్లా, డాక్టర్ సృజన, శ్రీనివాసగుప్తా, బ్లడ్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మురళిధర్ పాల్గొన్నారు.